

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న జితేందర్

మల్కాజిగిరిలో భారీ మెజార్టీ వచ్చేలా కృషి

- టీపీసీ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్

చంపాపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్‌కు జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి ఘన విజయం సాధించనున్నట్లు టీపీసీ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి చంపాపేటలో మిద్దెల జితేందర్ నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ ప్రతి బూత్‌లో భారీ మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయనున్నట్లు అన్నారు. ఎమ్మెల్సీని ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, కృష్ణ, యాదగిరి, గోపాల్‌ముదిరాజ్ పాల్గొన్నారు.



సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

సరూర్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని శివసాయి నగర్‌కాలనీలోని గౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత లక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



షీల్డ్‌తో కేవీకే జట్టు, టీం స్పాన్సర్ విజయ్‌కుమార్

బీపీఎల్ సీజన్-7 విజేత కేవీకే జట్టు

- విన్నర్, రన్నరప్ జట్లకు నగదు, షీల్డ్ అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బండరావిరాల ప్రీమియర్ లీగ్ సీజన్-7 (బీపీఎల్) క్రికెట్ టోర్నీ ముగిసింది. మొత్తం ఈ టోర్నీలో 6జట్లు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి వరకు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కేవీకే, కేకేజీ జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కేవీకే టీం విజేతగా నిలువగా.. కేకేజీ టీం రన్నర్‌తో సరిపెట్టుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కొత్త బాలనర్సింహగౌడ్‌కు దక్కింది. ఈ కార్యక్రమానికి గ్రామ ఎంపీటీసీ దంతూరి అనితామహేందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విన్నర్, రన్నర్ జట్లకు నగదు బహుమతితో పాటు షీల్డ్‌ను అందజేశారు. విన్నర్ జట్టు దక్కించుకున్న రూ. 25వేల నగదు బహుమతిని గ్రామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విరాళంగా అందించనున్నట్లు టీం స్పాన్సర్ కందికంటి విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

అప్పులు చేసిందని కత్తితో చంపబోయాడు

- గాయాలతో ఆస్పత్రిలో చేరిన భార్య

జవహర్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తనకు తెలియకుండా అప్పులు చేస్తోందన్న కోపంతో భార్యపైకి కత్తితో దాడి చేశాడో భర్త. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం జవహర్‌నగర్ కార్పొరేషన్ సంతోష్‌నగర్‌లో మేడ ఇందిర భర్త పెద్దబ్బాయి, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. బతుకు తెరువు కోసం గుంటూరు జిల్లా నుంచి వలస వచ్చారు. ఇందిర (39) నాటుకోడి చికెన్ సెంటర్‌ను నిర్వహిస్తుండగా, భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. భార్యభర్తల మధ్య తగాదాలతో పెద్దబ్బాయి మూడేళ్ళుగా కుటుంబానికి దూరంగా ఉన్నాడు. ఇటీవల భార్యభర్తల మధ్య సయోధ్య కుదరడంతో గత మూడు నెలలుగా కలిసి ఉంటున్నారు. భర్తకు తెలియకుండా ఇందిర నాలుగు లక్షల రూపాయల వరకు అప్పులు చేసింది. అప్పుల వారు ఇంటికి వస్తుండటంతో పెద్దబ్బాయి ఇందిరను నిలదీశాడు. ఈ క్రమంలో చికెన్ షాప్ వద్ద ఇద్దరూ ఉన్నపుడు మాటామాటా పెరగడంతో కత్తితో భార్యపై దాడిచేసి చేయిపై, తలమీద నరికాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా క్షతగాత్రురాలిని 108లో గాంధీ దవాఖానాకు తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఎమ్మెల్యే నివాసంలో హోలీ వేడుకల్లో సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



బడంగ్‌పేట్‌లో సంబరాల్లో మేయర్ పారిజాతారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న సీపీఎన్ఆర్ టౌన్‌షిప్‌వాసులు



ఎల్బీనగర్‌లో సంబరాల్లో కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్



మన్సూరాబాద్ కార్పొరేటర్ కార్యాలయంలో హోలీ వేడుకల్లో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



సైదాబాద్‌లో కుటుంబ సభ్యులతో హోలీ వేడుకల్లో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ



సైదాబాద్‌లో హోలీ సంబరాల్లో బీజేపీ నేతలు సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు



మూసారాంబాగ్‌లో వేడుకల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, గువ్వల రాములు, డాలి వినోద్‌కుమార్



బడంగ్‌పేట్ 31వ డివిజన్‌లో కామ దహనంలో మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు

రంగుల కేళీ.. సంబరాల హోలీ

ఎల్బీనగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రంగుల కేళీ హోలీని సోమవారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ ప్రజలు వాడవాడల ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఆదివారం రాత్రి కాముడి దహనం నిర్వహించిన ప్రజలు సోమవారం ఉదయం నుంచే రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకుంటూ రంగులు పూసుకున్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నివాసంలో జరిగిన వేడుకల్లో సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు. వాసవీకాలనీలో జరిగిన హోలీ సంబరాల్లో స్థానికులతో కలిసి యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు మునిగితేలారు. సరూర్‌నగర్, లింగోజిగూడ, ఆర్‌కేపురం ప్రాంతాల్లో వేడుకల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో..

సరూర్‌నగర్: హోలీని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్‌ల పరిధిలోని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆదివారం రాత్రి కామ దహనం నిర్వహించి, కాముడి పాటలు పాడుతూ ఆటలాడారు. హోలీ సందర్భంగా బంధువులు, స్నేహితులు ఒకరికొకరు మిఠాయి పేర్లు(మిఠాయి దండలు) వేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలో చిన్నా, పెద్దలు ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలో కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కాలనీ కోశాధికారి జితేందర్‌రెడ్డి, ఉత్సవ సమితి అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, కార్యదర్శి గోవర్ధన్‌రావు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్: మూసారాంబాగ్, మలక్‌పేటలో సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ పార్కులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొక్క గోవర్ధన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి దండెం రాజశేఖర్‌రెడ్డి, గువ్వల రాములు, డాలి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో హోలీ సంబరాలను వైభవంగా నిర్వహించారు. యువతీ, యువకులు నృత్యాలు చేస్తూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకలు జరుపుకున్నారు.

జోరుగా కాముని దహనం..

మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ చౌరస్తాలో ఆదివారం రాత్రి కామదహనం చేయగా మార్వాడీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్: మన్సూరాబాద్ కార్పొరేటర్ కార్యాలయంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ కాలనీల ప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హోలీ వేడకల్లో పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరపుకున్నారు. చిన్న పెద్ద తేడాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఉత్సహంగా సంబరాల్లో మునిగితేలారు.



మీర్‌పేట్ మునిసిపల్ కార్యాలయం వద్ద హోలీ సంబరాల్లో మునిసిపల్ సిబ్బంది, ఉద్యోగులు



నాదర్‌గుల్‌లోని మాతృ దేవోభవ అనాథాశ్రమంలో హోలీ సంబరాలు జరుపుకుంటున్న ఆశ్రమం నిర్వాహకుడు గిరి



హయత్‌నగర్ వినాయకనగర్ కాలనీలో హోలీ సంబరాల్లో చిన్నారులు



హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలో కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కాలనీప్రతినిధులు



సైదాబాద్‌లో హోలీ సంబరాల్లో కుటుంబసభ్యులతో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి



గణేష్‌నగర్‌కాలనీలో హోలీ సంబరాల్లో స్థానికులు



ఎల్బీనగర్‌లో సంబరాల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు



చంపాపేట డివిజన్ మాధవనగర్‌కాలనీలో హోలీ సంబరాల్లో బాలబాలికలు



మూసారాంబాగ్‌లో హోలీ వేడుకల్లో చిన్నారులు

అయ్యప్ప ఆలయంలో ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

- హాజరైన మాజీ మంత్రులు డీకే అరుణ, ఈటల రాజేందర్

చంపాపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ డిఫెన్స్‌కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించిన 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా హరిహరసుత అయ్యప్పస్వామి పదునెట్టాంపడి మహాపడి పూజను కనుల పండువగా నిర్వహించారు. అయ్యప్పనామస్మరణతో ఆలయం మారుమ్రోగింది. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, మాజీ మంత్రి, మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరై స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి వారికి ఘనస్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. జగద్గురువులు హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి అనుగ్రహంతో చాముండేశ్వరీ గురుదత్తపీఠం వ్యవస్థాపకులు కొడగండ్ల శ్రీరామశరన్‌వర్మ గురూజీ, రమణగురుస్వామి, రాజేశ్‌పాండే పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు రంజిత్‌తంత్రిలు పదునెట్టాంపడిని వెలిగించారు. ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డం మంగారెడ్డి, ఆలయ డైరెక్టర్లు సద్ది సందీప్‌రెడ్డి, లంకల రమేష్‌రెడ్డి, లింగాల దశరథ్‌గౌడ్, కొక్కొండ సూర్యప్రకాష్‌గుప్తా, సుంకరి రమేష్‌గౌడ్, విజ్ఞేశ్వర్‌రెడ్డి, అంజయ్యగుప్తా, హరీష్‌రెడ్డి, నిర్మలేష్‌గుప్తా, హరికృష్ణగుప్తా, మణిపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌గుప్తా, కేశవరెడ్డి, భిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వార్షిక బ్రహ్మోత్సవాల్లో మాజీ మంత్రులు డీకే అరుణ, ఈటల రాజేందర్, ఆలయ వ్యవస్థాపకుడు మధుసూదన్‌రెడ్డి



పదునెట్టాంపడిని వెలిగిస్తున్న ప్రధాన అర్చకులు రంజిత్‌తాంత్రి

వైన్‌షాపులు క్లోజ్.. బెల్ట్ షాపులు ఓపెన్

(5వ పేజీ తరువాయి)

లోయర్ ధూల్‌పేట్, ఇందిరానగర్, గుప్తానగర్ తదితర ప్రాంతాల్లోని బెల్ట్‌షాపుల్లో పెద్దఎత్తున మద్యం విక్రయాలు జరిగాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు పెద్దఎత్తున అమ్మకాలు సాగాయి. బహిరంగంగా విక్రయాలు జరిపినా, ఆవైపు పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి చూడలేదు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగరేణి కాలనీలో మద్యం ఏరులై పారింది. క్వాటర్ బాటిల్ మీద రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేశారు. వీధుల్లోనే కొందరు మహిళలు పోటీపడి మరీ విక్రయాలు జరిపారు.

మత్తులో జోగిన ఎక్సైజ్ శాఖ అధికారులు

నగరంలోని పలుప్రాంతాల్లో వైన్‌షాప్ నిర్వాహకులే హోలీ వేళ.. బెల్ట్ షాపులను తెరిచారు. మద్యం విక్రయాలన్నీ ఆయా ఎక్సైజ్‌శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరిగాయనే ఆరోపణలున్నాయి. నాచారంలోని ఓ వైన్‌షాపు నిర్వహకులు కూడా సమీపంలోని ఓ ఇంట్లో నుంచి విక్రయాలు జరుపగా, అంబర్‌పేట, ముషీరాబాద్‌లోనూ కొందరు వైన్‌షాపు నిర్వాహకులు అమ్మకాలు జరిపినట్లు తెలిసింది. లంగర్‌హౌజ్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ యజమానే సమీపంలోని ఓ గోదాంలో మద్యం ఏర్పాటు చేసి జోరుగా విక్రయించినట్లు సమాచారం. అదేవిధంగా గచ్చిబౌలిలోని ఓ పబ్ నిర్వహకుడు కూడా ఓ వాహనంలో మద్యం అమ్మకాలు సాగించారు. ఇలా నగరం నలుమూలాల హోలీ వేళ.. మద్యం విక్రయాలు పెద్దఎత్తున జరిపారు.

సనాతన వేదాంత జ్ఞానసభలు ప్రారంభం

- శాస్త్రోక్తంగా శివపార్వతుల కల్యాణం
- తరలివచ్చిన భక్త జనం

సరూర్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, సద్గురు మళయాళస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో బాలాపూర్‌లోని ఎస్‌పీఆర్ లక్ష్మీగార్డెన్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సనాతన వేదాంత జ్ఞాన సభలు సోమవారం ఆడంబరంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన సోమవారం తెల్లవారు జామున 4గంటలకు సుప్రభాతం, ప్రబోధంతో కార్యక్రమం ప్రారంభించి, అనంతరం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతులు పరిపూర్ణానందగిరిస్వామి ప్రణవ పతాకావిష్కరణ చేయగా, సరూర్‌నగర్ మాజీ ఎంపీపీ సామల రంగారెడ్డి వినోద దంపతులు యజ్ఞేశ్వర ప్రతిష్ఠ, కాశెట్టి పాండుగుప్తా వీరమణి దంపతులు అఖండ జ్యోతి ప్రజ్వలన, సూరిశెట్టి శ్రీనివాస్‌గుప్తా సత్యవేణి దంపతులు కలశస్థాపన నిర్వహించారు. దేవీ ఉపాసకులు బ్రహ్మశ్రీ మురుకుంట్ల రాజేశ్వరశర్మ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ నవగ్రహ యజ్ఞాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ వేడుకలను కనులారా వీక్షించారు. వేడుకల్లో మాజీ డీజీపీ కె.అరవింద్‌కుమార్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన స్వామీజీలు, మఠాధిపతులు, పీఠాధిపతులు భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు అందజేశారు.



యజ్ఞ క్రతువులో భక్తులు



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

వనస్థలిపురం : హాస్టల్‌లో ఉంటున్న యువకుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం పందలపాడు గ్రామానికి చెందిన వర్ల కిరణ్ కుమార్(26) హస్తినాపురంలోని సాహితీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ మయూరి కమ్యునికేషన్స్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం హాస్టల్‌కు వచ్చిన కిరణ్ కుమార్ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. సోమవారం ఉదయం వరకు తలుపు తెరవకపోవడం, పక్కరూమువాళ్లు తలుపు కొట్టినా తీయలేదు. హాస్టల్ నిర్వాహకులు వెంటిలేటర్ నుంచి చూడగా, ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించాడు. హాస్టల్ నిర్వాహకుడు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కిరణ్ తల్లిదండ్రులకు సమాచారమందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

వ్యవసాయ భూమిలో అనుమతిలేని వ్యాపార సముదాయాలు

- అల్మాస్‌గూడలో యథేచ్ఛగా
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

సరూర్‌నగర్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిలో వ్యాపార సముదాయాలకు సంబంధించిన భవనాలుగానీ, షెడ్లుగానీ నిర్మించాలంటే నిబంధనల మేరకు సదరు భూమిని నాలా చట్టం ప్రకారం వ్యవసాయేతర భూమిగా మార్చాల్సి ఉంటుంది. అనంతరం మునిసిపల్ శాఖ నుంచి అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో మాత్రం సదరు నిబంధనలు బుట్టదాఖలవుతున్నాయి. నాలాకన్వర్షేషన్ చేయకుండానే భూయజమానులు కమర్షియల్ అవసరాల కోసం లీజుకు ఇస్తుండడంతో అక్కడ వ్యాపారులు ఇష్టానుసారంగా భారీ షెడ్లు, భవనాలు నిర్మిస్తున్నారు. దాంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది.

అల్మాస్‌గూడలోనూ ఇదే తంతు

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో ప్రస్తుతం ఇదే తంతు కొనసాగుతోంది. అల్మాస్‌గూడ కమాన్ నుంచి రామిడి కళావతినగర్ కమాన్ వరకు గల ప్రధాన రహదారిలో ఇబ్బడిముబ్బడిగా వ్యాపార, వాణిజ్య అవసరాల నిమిత్తం భారీ షెడ్ల నిర్మాణం కొనసాగుతోంది. ఇక్కడి 234 నుంచి 246 వరకు గల సర్వే నంబర్లలోని భూమిలో మార్బుల్స్, టైల్స్, పెట్రోల్ పం పు వంటి వ్యాపారాలకు సంబంధించిన నిర్మాణాలను ఇష్టానుసారంగా కొనసాగిస్తున్నారు. గతంలో హయత్‌నగర్ రెవెన్యూ మండలంలోని సాహెబ్‌నగర్‌కలాన్ రెవెన్యూ గ్రామ పరిధిలో కొనసాగిన సదరు సర్వే నంబర్లను కొంత కాలం క్రితం అప్పటి మంత్రి సబితారెడ్డి బాలాపూర్ మండలంలోని అల్మాస్‌గూడ రెవెన్యూలో విలీనం చేయించారు. ఈ ప్రాంతంలో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టాలంటే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) తప్పనిసరి. కానీ ఇక్కడ అలాంటి నిబంధనలు ఏమాత్రం పాటించకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా మునిసిపల్ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.



అల్మాస్‌గూడ రహదారిలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న షెడ్లు

స్థానికులు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

అల్మాస్‌గూడ ప్రధాన రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల స్థానిక సాయిబాలాజీ టౌన్‌షిప్ కాలనీకి చెందిన పలువురు నివాసితులు బడంగ్‌పేట్ మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఇక అల్మాస్‌గూడకు చెందిన ఒకరిద్దరు ప్రజా ప్రతినిధులు సైతం అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై, అధికారులు వాటిపై చర్యలు తీసుకోకుండా 'మేనేజ్' చేస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా దీనిపై బడంగ్‌పేట్ టీపీఎస్ లాలప్పను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, వివరాలు తెలుసుకున్న తర్వాత తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.